
# ఆదెమ్మమ్మమ్మ

కథ

ఎన్.వి.యస్.నాగభూషణాచార్యులు

ఇంటి దగ్గర్నుంచి అక్కయ్య ఉత్తరం రాసింది- అమ్మకు వంట్లో బాగోలేదని. ఒకసారి వీలు చూసుకుని వచ్చివెళ్ళవలసిందనీ. నెలరోజుల కిందటే ఇంటికి వెళ్ళివచ్చాను. అప్పుడు నీరసంగా వుందంటే డాక్టరుకి చూపించాను. ఏదో టానిక్ రాసిచ్చాడు. ఇప్పుడు మళ్ళీ బాగోలేదని ఉత్తరం! పెద్దతనంవల్ల ఏవో అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. అయినా నెలకీ, రెండు నెల్లకీ వెళ్ళి చూసిరావడం జరిగేదే కనుక, నాలుగైదు రోజుల్లో వెళ్ళి చూసి రావాలనుకున్నాను. పక్క వీధిలోనే డాక్టరు ఉంటాడు. అక్కయ్య అక్కడే వుంటోంది కనుక, ఆమె వెళ్ళి చూపిస్తుంది డాక్టరుకి. అయినా నేను వెళ్ళి చూపించిన దారి వేరు. అది ఆమెకు సంతృప్తినిస్తుంది. ఇలా అనుకుంటూండగానే యూనివర్సిటీ నుండి డిపార్టుమెంటు క్లర్కు ఉత్తరం రాశాడు. థీసిస్‌వర్కు ఎంతవరకు వచ్చిందో, అయినంతవరకు పేపర్స్ తీసుకుని గైడ్‌ను ఒకసారి కలవమని దాని సారాంశం.

రెండు పనులూ కలిసి వస్తాయని భావించి, ఒకసారి గైడ్‌కు ఫోన్ చేసి, ఆయన ఉంటాడని నిర్ధారించుకుని, సి.యల్.కలిసి వస్తుందనే ఉద్దేశంతో రెండో శనివారం బయలుదేరాను. ఆరోజు కాలేజీకి సెలవే గానీ, యూనివర్సిటీ వుంటుంది. కవిలకట్టలు పుచ్చుకుని, ఫాస్టు పాసింజర్‌కి బయలుదేరాను. థీసిస్ రిటెన్ వర్కు పూర్తయ్యింది గానీ, బిబ్లియోగ్రఫీ పూర్తి కాలేదు. చుక్కలు, కామాలు, సెమికోలన్‌లు అన్నీ లెక్క ప్రకారం పెట్టాలి! తల నెప్పి వచ్చి ఎప్పటికప్పుడు ఆ పని వాయిదా వేస్తూ వచ్చాను. ఇదంతా పట్టించుకునే ఓపిక గానీ, థీసిస్‌ని పరిశీలించి సవరణలు వివరణల గురించి సలహా యిచ్చే తీరిక గానీ గైడ్‌కు ఎక్కడుంది? యూనివర్సిటీ రాజకీయాలకే వాళ్ళకి సమయం చాలదు. ఆయన ఒక్క నిమిషం కాగితాలన్నీ అటూ ఇటూ తిప్పి, పరిశీలించినట్లు నటించి, వెంటనే డి.టి.పి.కిచ్చి, నాలుగు కాపీలు నీట్‌గా తయారుచేసి, డిసెంబరు నాటికల్లా థీసిస్‌ని సబ్‌మిట్ చేస్తే,



రెండు మూడు నెల్లలోగా డాక్టరేట్ వచ్చేలా చూస్తానని, అయితే కొంత ఖర్చవుతుందనీ చెప్పాడు. ఎంతవుతుందని అడిగాను. థీసిస్‌ని పరిశీలించే ఇతర యూనివర్సిటీ ప్రొఫెసర్స్‌కి ఇస్తే మంచి రిపోర్టు ఇస్తారని ఇదంతా మామూలే నని, ఎంతవుతుందో సబ్‌మిట్ చేసేటప్పుడు చెబుతానని అన్నాడాయన. అవినీతికి మారుపేరయిన ఈ వ్యవహారాన్ని విని, ఏమనలేక, డాక్టరేట్ చెయ్యాలనుకోవడమే నేను చేసిన నేరంగా భావించి, నిండా మునిగిన వాడికి చలేమిటని, 'అలాగే'నని బుర్ర తిప్పి, అక్కడి నుండి బయట పడ్డాను. ఇంటికి రావాలంటే విజయవాడ మీదుగానే రావాలి గనుక, విజయవాడ వచ్చి, ఏలూరు రోడ్డుకేసి బయలుదేరాను.

ఏలూరు రోడ్డు నాబోటి పుస్తక ప్రియులకు నందనవనం! విజయవాడ వచ్చినప్పుడల్లా కనీసం ఆ రోడ్డులో ఉన్న పుస్తకాల షాపుల్లో నాలుగైదు గంటలు గడిపి, పుస్తకాల షాపులన్నీ గాలించి, రెండు మూడువందల రూపాయలు ఖర్చు పెడితే గానీ తృప్తి ఉండదు. మహాశ్వేతాదేవి కొత్తగా రాసిన ఓ నవలానువాదం, జాక్‌లండన్-ఓ కుక్క జీవితం గురించి రాసిన ఓ అద్భుతమైన 'అడివి పిలిచింది' అనే నవల- ఇలా నాలుగైదు పుస్తకాలు తీసుకుని చల్లపల్లి బంగ్లా దగ్గరకు రాగానే నూజివీడు వెళ్ళే బస్సు ఎదురొచ్చింది.

విజయవాడ నుండి మా ఊరికి ఓ గంట ప్రయాణం. బస్సు దిగగానే నేను చేసే మొదటిపని బస్‌స్టాండ్ పక్కనే ఉన్న పాలబూత్ దగ్గరకెళ్ళి, పాలపాకెట్టు తీసుకుని వెళ్ళడం. అదుంటే ఇంటికెళ్ళగానే అందరం మంచి టీ తాగొచ్చు కదా!

ఇంటికి వెళ్ళేసరికి, అక్కయ్య నూతిగట్టు దగ్గర గిన్నెలు కడుగుతూ కనిపించింది. నన్ను చూడగానే ఆప్యాయంగా "రా చంటీ... ఇంటి దగ్గర మరదలు, పిల్లలూ బాగున్నారా?" అంటూ నవ్వుతూ పలకరించింది.

నలభయ్యేళ్ళు దాటినా మా ఇంట్లో అందరికీ నేను చంటీనే. ఎందుకంటే ఇంట్లో అందరికంటే నేనే చిన్నవాణ్ణి గనుక!" బాగానే ఉన్నాం. అక్కయ్యా....అందరూ నిన్నూ, అమ్మనూ అడిగినట్లు చెప్పారు" అన్నా కాళ్ళు కడుక్కుంటూ.

అక్కయ్యను చూడగానే కడుపులో దేవుతుంది. పెళ్ళయిందన్న మాటేగానీ ఒక్క సంవత్సరమైనా భర్తతో సుఖంగా కాపురం చెయ్యలేదు. పెళ్ళిని ఓ వ్యాపారంగానే పరిగణించాడు భర్త. ఇచ్చిన కట్నం డబ్బులు ఓ రెండు మూడు నెలల్లోనే జల్సాగా ఖర్చు చేసి, పుట్టింటి నుండి డబ్బు తీసుకురా అంటూ తరమడం మొదలుపెట్టాడు. ఒళ్ళు ఒంగదు. ఒకరోజు పనిచేస్తే రెండు రోజులు శలవు పెడతాడు. ఏదో సొసైటీలో చిన్నపాటి గుమాస్తా. ఉద్యోగస్తుడు కదా అని అప్పు చేసి కట్నం యిచ్చి ఘనంగా పెళ్ళి చేశాడు నాన్న. తీరా చూస్తే అల్లుడు ఇదీ తంతు. ఒకటి రెండుసార్లు భర్త చెప్పినట్లు వింది అక్కయ్య. నాన్న కష్టజీవి. పెద్ద సంసారం. ఇక్కడి పరిస్థితులు చూసి మూడోసారి ఎదురు తిరిగింది భర్తకు. నేను అడగనని చెప్పింది. దాంతో హింసించడానికి కూడా సిద్ధమయ్యాడు. అక్కయ్యకు డిగ్రీలు లేకపోయినా మంచి సాహిత్య పరిజ్ఞానముంది. భర్త జల్సాలనైనా సహించిందిగానీ, హింసించడాన్ని సహించలేకపోయింది. దాంతో మొగుణ్ణి ఛీకొట్టి పుట్టింటికి వచ్చేసింది. నాన్న రాజీ ప్రయత్నాలు చేశాడు గానీ అవన్నీ విఫలమయ్యాయి. భార్యకు కూడు పెట్టలేనివాడివి పెళ్ళెందుకు చేసుకున్నావని పదిమందిలో భర్తను నిలదీసింది. తాను ఎవ్వరికీ భారం కాకూడదని టైలరింగ్ నేర్చుకుని, పుట్టింట్లోనే ఉంటున్నా తన కాళ్ళ మీద తాను నిలబడింది. నాన్న మళ్ళీ పెళ్ళి చెయ్యాలని తలపెట్టినా, వద్దని కరాఖండీగా చెప్పింది. నాన్న చనిపోయాక, నేను ఉద్యోగరీత్యా దూరంగా ఉండాల్సి వచ్చినా, ఆ లోటు కనబడనీయకుండా అమ్మకు ఆసరాగా ఉండటమేగాక, తాను ధైర్యంగా ఉంటూ, అమ్మకు మరో కొడుకులాగా అండగా నిలబడింది. ఆమె జీవితం మోడు బారిందనే బాధ ఉన్నా, నిబ్బరమైన ఆమె వ్యక్తిత్వానికి గర్వంకూడా కలుగుతుంది.

అక్కయ్యకు పాలపాకెట్టిచ్చి "ఏమిటి అమ్మకు సుస్తీ." అనడిగాను.


"బాత్‌రూమ్‌లో కాలుజారిపడింది.

ఫ్రాక్చర్ కాలేదు గానీ, కాలు బాగా వాచింది. నాలుగు రోజులనించీ లేవడం లేదు. డాక్టరుకి చూపించాను. ఇంజక్షన్ చేస్తున్నాడు. బిళ్ళలు కూడా వాడుతున్నాం" అంది అక్కయ్య.

నేను హాల్లోకి నడిచాను. మంచంమీద పడుకుని ఉంది అమ్మ. నిద్ర పోతోంది. లేపడం ఎందుకులెమ్మని పక్కనున్న స్టూల్‌మీద కూర్చున్నాను. కాలికి కట్టుకట్టి ఉంది. ఈ వయస్సులో దెబ్బలు తగిలితే మానడం కష్టం. ఫ్రాక్చర్ కాకపోవడం అదృష్టం. ఆమెకు మెలకువ వచ్చాక మాట్లాడొచ్చని, బయట మామిడిచెట్టు దగ్గరకు కుర్చీ తీసుకెళ్ళి కూర్చున్నాను. ఇంటి చుట్టూ విశాలమైన ఖాళీ స్థలంలో ఎన్నో చెట్లు, పూల మొక్కలు. స్వంతయిల్లు, అది పూరిల్లయినా, అందులో ఉండే హాయి అద్దెకొంపల్లో ఎలా వుంటుంది? అందునా ఇలాంటి ప్రకృతి పట్టణంలోని ఇరుకు యిళ్ళల్లో వుంటుందా?

మామిడిచెట్టు కింద కూర్చుని మట్టివాసన అనుభవిస్తోంటే అక్కయ్య టీ తీసుకువచ్చి యిచ్చింది. తనూ గ్లాసు తెచ్చుకుని మామిడివేరు మీద కూర్చుని తాగసాగింది.

"ఏమిటక్కయ్యా విశేషాలు, నీ టైలరింగెలా సాగుతోంది?" అడిగాను టీ తాగుతూ.



"ఏదో నడుస్తోంది. ఇప్పుడందరికీ ఫాషన్లు కావాలిగదా. నాలాంటి వాళ్ళ కవన్నీ తెలుస్తాయా? పెడతాయా? అయినా ఏదో బండి నడుస్తోందనుకో! ఇంతకీ నీ సంగతులేమిటీ? పిల్లల చదువులెలా సాగుతున్నాయి?" అడిగింది అక్కయ్య.

నేనేదో చెప్పబోతుండగా గేటు దగ్గర ఎవరో వచ్చిన చప్పుడైంది "శేషమ్మగారూ" అంటూ పిలుస్తోంది ఓ ఆడమనిషి. చీకటి పడటంవల్ల ఆ మనిషి ఎవరైందీ ఆనవాలు చిక్కలేదు. వరండాలో లైటు వేసివుంది గానీ, ఆ కాంతి గేటుదాకా పడదు.

"ఉండు చంటీ, ఇప్పుడే వస్తాను" అంటూ అక్కయ్య గేటు దగ్గరకు వెళ్ళింది.

"ఏంటి రాజమ్మ, ఇంత చీకట్లోవచ్చావు. ఏమన్నా అర్జంటు పనా?" అడుగుతోంది వచ్చిన ఆడమనిషితో అక్కయ్య.

"అవునమ్మా, పెళ్ళిపీట గురించి వచ్చానమ్మా" అంటోంది ఆ వచ్చిన మనిషి.

"రా, లోపలికి! ఏమిటి ఇప్పుడే తీసుకెడతావా ఏంటి పీటని?" అంటూ అక్కయ్య గేటు తీసినట్లుంది, ఆ మనిషి లోపలికి వచ్చింది.

"ఇప్పుడెలా తీసుకెడతానమ్మా పరాచకాలాడుతున్నారు గానీ? ముందు చెప్పిపోదామని వచ్చా. మీరు రడీ చేసి వుంచుతారని. భోజనాలవీ అయ్యాక బాండ్‌మేళంతో వస్తామమ్మా!" అంది వచ్చినామె.

"ఇంతకీ పెళ్ళెవరికి రాజమ్మా? మీ ఇంట్లోనా లేక పక్కన ఎవరికన్నానా?" అక్కయ్య అడుగుతోంది.

"ఎవరింట్లోనో అయితే నేనెందుకొస్తానమ్మా, మా యింటోనే. నా మనవరాలి పెళ్ళి నా మనవడితో!" అంటూ "మీ అమ్మగారెట్టా వుందమ్మా" ఆరా తీసిందామె.

"ఫర్వాలేదు. నిద్ర పోతోంది గానీ, కూర్చో" అంటూ వరండాల్లో పీట వాల్చింది అక్కయ్య.

"లేదమ్మా వస్తాను. ఇంకా ఇంట్లో చాలా పనులు చూడాలి!" అంటూ వెనుదిరిగింది కాస్తా చెట్టు కింద నన్ను చూసి "ఎవరమ్మా ఆ చెట్టు కింద... చుట్టాలు గానీ వచ్చారా?" అనడిగిందామె.

"మా తమ్ముడు చంటి. ఇందాకే వచ్చాడు" అంది అక్కయ్య.

"చంటబ్బాయా, అంటే మూడో అబ్బాయా?"

"అవును రాజమ్మా, పాలకొల్లులో పచేస్తున్నాడు" అంది అక్కయ్య.

"సరేనమ్మా, నేను మళ్ళీ వస్తా" అంటూ రాజమ్మ వెళ్ళే వెళ్ళేది కాస్తా మామిడిచెట్టు దగ్గరకొచ్చి "బాగున్నావా బాబూ?" అంటూ పలకరించింది.


"బాగున్నానమ్మా!" అంటూ ఆ వచ్చిన మనిషి రాజమ్మంటే ఎవరా అని తేరిపార చూశాను. మా ఇంటి పక్కనున్న ముతరాసు బజారులో రాజమ్మలు చాలామంది ఉన్నారు. చెట్టు దగ్గరకు లైటుకాంతి కొంత పడటంవల్ల వచ్చిన రాజమ్మ ఏ రాజమ్మో కొంత ఆనవాలు చిక్కింది. ఈ రాజమ్మా? అంటే ఈమె...

"ఏవమ్మా... నువ్వు ఆదెమ్మమ్మమ్మ కోడలివి కదూ?" అడిగాను.

"అవును బాబూ..." అంది రాజమ్మ.

ఆదెమ్మమ్మమ్మ జ్ఞాపకాలు అంత తేలిగ్గా మరిచిపోగలిగేవా? ఆదిమ్మమ్మమ్మ గుర్తు రాగానే ఆమె తాలూకు జ్ఞాపకాలు ఒక్కొక్కటీ గుర్తు రాసాగాయి. ఆమెకు ఇద్దరు కోడళ్ళు. ఇద్దరు కోడళ్ళలోనూ ఈ కోడలి గూర్చి చెబుతూ ఎప్పుడూ తిట్టిపోసేది ఆదెమ్మమ్మమ్మ."అదీ, అది ఒట్టి ముదనష్టపు ముండ బాబూ, దాన్నోట్లో నోరు పెట్టలేం. నా కొడుకుని నాకు కాకుండా చేసిందిగా!" అంటూండేది పెద్దకోడల్ని తల్చుకున్నప్పుడల్లా. రెండో కోడలు ఎలాంటిదైనా ఆమె ఊసెత్తేది కాదు. ఎందుకనంటే రెండో కోడలు స్వయానా తన మనవరాలే గనుక. "పెట్టినా, తిట్టినా నా మనవరాలు చెయ్యాలి గాని, పెద్దదెందుకు పనికొస్తది?" అంటూ రెండో కోడల్ని వెనకేసుకొచ్చేది.

దెబ్బకు అందకపోయేసరికి వాడిని అహంభావం మరింత రెచ్చగొట్టింది. ఏమయినాసరే దాన్నిపెట్టి కొట్టాలని తను ఎక్కడికి వెడితే అక్కడికల్లా వెంటపడ్డాడు.



పెద్ద కోడలు పెళ్ళవ్వగానే మొగుణ్ణి తీసుకుని వేరే కాపురం పెట్టింది. అత్తను లెక్కచేసేది కాదు. కాస్తో కూస్తో కలిగినింటినుండి రావడం వల్ల ఆ గర్వంతోటే మొగుణ్ణి కూడా తనమాట జవదాటనీయకుండా చేసుకుంది. ఆ అక్కస్సే ఆదెమ్మమ్మమ్మ మాటల్లో వ్యక్తమయ్యేది. నేను చిన్నవాణ్ణవడంవల్ల అమ్మకు ఆదెమ్మమ్మమ్మ ఈ విషయాలన్నీ చెబుతూంటే ఆలకించేవాణ్ణి అంతే. ఎన్నో సందేహాలు మనసులో తలెత్తినా అడిగేవాణ్ణి కాదు. నీకెందుకు అని కసురుకుంటారేమోనని భయం. అత్తలు కోడళ్ళని పెట్టే ఇబ్బందుల గురించి వచ్చే వార్తలకు భిన్నంగా, కోడలు అత్తని పెట్టే ఇబ్బందులు ఆదిమ్మమ్మమ్మ నోటివెంట వింటూ ఆశ్చర్యపోవాల్సి వచ్చేది.

ఈ మాటలన్నీ శ్రద్ధగా అమ్మపక్కన కూర్చుని వినే నన్ను చూసి ఆదెమ్మమ్మమ్మ అంటూండేది "బాబూ, నువ్వు పెద్దయి పెళ్ళి చేసుకున్నాక, పెళ్ళాం మాటలు విని మీ అమ్మగారిని బాధపెట్టకు. మీ అమ్మగారు చెప్పినట్టు నడుచుకో!"

"పో ఆదెమ్మమ్మమ్మా!" అంటూ సిగ్గుతో పారిపోయే నన్ను చూసి ఆదెమ్మమ్మమ్మ నవ్వేది.

ఆమె పెద్దకొడుకు ఓ పెద్ద మామిడితోటకు కాపలాగా వుండేవాడు. ఆ తోట యజమానికి ఎక్కడో దూరంగా టౌన్‌లో వుండేవాడు గనుక, ఆ తోటమీద పెత్తనం ఇతనే చేసేవాడు. తోట కాపుకొచ్చినప్పుడు కాయలు అమ్మటం, దాంతోపాటు ఎండుకొమ్మలు పుల్లలుగా అమ్ముకుని, పచ్చగడ్డితో పశువుల్ని మేపుకుని నమ్మకంగా ఉంటూ బాగానే సంపాదించాడు. చివరికి యజమానికి తోటను అమ్మేస్తే తనే కొనుక్కున్నాడు చవగ్గా.

రెండో కొడుకు వడ్ల మిల్లులో కాటా పని చేస్తూండేవాడు. రెక్కాడితేగానీ డొక్కాడదు.ఇద్దరికీ సమానంగా నలుగురేసి పిల్లలున్నా, పెద్దోడి సంపా

దిగులంతా చిన్నకొడుకు పిల్లల గురించే.

"పాపం మా చిన్నోడిపిల్లలు ఆకలికి ఆవురావురుమంటున్నారమ్మా. రెండు ముద్దలు అన్నం వుంటే పెట్టమ్మా" అంటూ వచ్చేది ఆ సమయం ఈ సమయం అంటూ లేకుండా. అమ్మ రాత్రి అన్నం వుంటే వెంటనే పెట్టేది. లేకపోతే "మధ్యాహ్నం రా పెద్దమ్మా, చద్దన్నం వుంటే పిల్లలు తినేశారు!" అనేది.

నిజమే. మా అన్నయ్యలిద్దరూ చద్దన్నం తినేవాళ్ళు కాకపోయినా, నేను మాత్రం ఉదయమే చద్దన్నం తిని కేశవరావు మాస్టారి ప్రైవేటుకి పరిగెత్తేవాణ్ణి. ఆయన ఒక్క నిమిషం ఆలస్యమయితే ఊరుకునేవాడు కాదు. "ఏరా లేటుగా వచ్చావా?" అని ఒక్కసారి గుడ్లురిమి చూస్తే చాలు, పై ప్రాణాలు పైనే పోయేవి. ఎంతవాళ్ళనయినా మెడకాయ పుచ్చుకుని పైకి లేపేసేవాడాయన. ఆ లేపుడుకు దడుసుకుని జ్వరాలు వచ్చినవాళ్ళు కూడా వున్నారు. అయినా నాకు ఆయన ప్రైవేటు చదవక తప్పలేదు. మూడోక్లాసు చదువుతున్నప్పుడు కాలికి సైకిలు యాక్సిడెంటయినందువల్ల ఆ సంవత్సరం చదువు ఆపెయ్యాల్సి వచ్చింది. సంవత్సరం చదువు పోయింది. ఈ మేష్టారు హెడ్మాష్టారితో కలిసి ప్రైవేట్లు చెబుతూ నన్ను మూడో క్లాసు నుంచి నాలుగోక్లాసు చదవకుండానే అయిదులోకి వేస్తానని చెప్పినందువల్ల, సంవత్సరం కలిసి వస్తుందని ఈయన ప్రైవేటులో చేర్పించాడు నాన్న.

"శేషమ్మ తల్లీ! నీ చేతికి ఎముక లేదమ్మా!" అంటూ అమ్మను పొగిడేది ఆదెమ్మమ్మమ్మ. పిల్లలకు గానీ, భర్తకు గానీ అన్నంలేక ఆకలితో బాధపడుతుంటే సందేహించకుండా వచ్చి అమ్మను అన్నం అడిగి పెట్టించుకుని వెళ్ళినా, ఊరికే తీసుకునేది కాదామె. ఆవార ఇంటిపని చేసిపెట్టేది. అమ్మ కూడా ఎప్పుడు పని చేసుకోలేక పోయినా "అరేయ్ చంటీ, వెళ్ళి ఆదెమ్మ పెద్దమ్మను పిలుచుకు రారా" అంటూ పిలవనంపేది.

అమ్మకు ఆరోగ్యం సరిగ్గా వుండేది కాదు అప్పటికే. ఎక్కువ కాన్పులు అమ్మ ఆరోగ్యాన్ని పాడు చేశాయి. దీనికి తోడు ఎప్పుడూ చుట్టాలతో వచ్చిపోయే ఇల్లు కావడంచేత వంటా వార్పూ చేసిపెట్టడానికే సతమతమయ్యేది అమ్మ. అమ్మ పిలవమనడం ఆలస్యం నేను రయ్యిన పరుగెత్తుకువెళ్ళేవాణ్ణి ఆదెమ్మమ్మమ్మను పిలవడానికి. ఇంట్లో వుంటే నా వెనకే వచ్చేది ఆదెమ్మమ్మమ్మ. ఆమె లేకపోయినప్పుడు తాత నేను రావడం చూసి "ఏం బాబూ, అమ్మమ్మ కోసం వచ్చావా?" అనడిగేవాడు బోసినోటితో నవ్వుతూ.

"అవును. అమ్మ పిలుచుకురమ్మంది. ఏదీ ఆదెమ్మమ్మమ్మ?" అంటూ ఆమెకోసం ఇల్లంతా వెతికేవాణ్ణి.

"చిన్నోడింటికి ఎళ్ళినట్టుంది బాబూ. నువ్వెళ్ళు. నేను పంపుతాలే" అనేవాడు తాత.

నేను అమ్మ పిలవమనగానే ఆదిమ్మమ్మమ్మను పిలవడానికి వెంటనే పరిగెత్తుకు వెళ్ళడానికి ఓ కారణముంది.

తాత వేరుశనగ చేలల్లో, మామిడి తోటల్లో కాపలా వుండేవాడు. అందుచేత వాళ్ళింట్లో ఏ పంటకాలంలో అవి వుండేవి. నేను పిలవడానికి వెళ్ళగానే ఆదెమ్మమ్మమ్మ "రా బాబూ" అంటూ ఆప్యాయంగా పిలవడమే గాక, ఇంట్లో ఏ కాయలుంటే అవి ఇచ్చేది. ముఖ్యంగా మామిడికాయల కాలంలో. తోటల్లో రాలిన కాయంతా కాపలావాళ్ళ సొంత మేననవచ్చు. చిలకలు కొట్టి పడేసినవో, గాలికి రాలినవో ఎప్పుడూ వుంటాయి గనుక అటువంటి కాయలు కాపలా వాళ్ళు తినగా మిగిలినవే యజమానులకైనా దక్కుతాయి. ఇలాంటి కాయలు కొన్ని బుట్ట చేరగాళ్ళకు అమ్ముకుని డబ్బు చేసుకున్నా, కొన్ని ఇంటికి కూడా పట్టుకెడుతుంటారు. యజమానులు కూడా ఇటువంటి రాలుడు కాయల గురించి చూసీచూడనట్లు ఊరుకుంటారు. అందునా నూజివీడు చుట్టు పక్కల ప్రాంతం మామిడితోటలకు పెట్టింది పేరు. మామిడికాయలంటే ఎవరికిష్టం వుండదు గనుక! మాకు కాస్తో కూస్తో వరిపొలమే వుంది గానీ, మామిడితోట లేనందున, నాకు మామిడికాయలు తినాలనిపించినప్పుడల్లా ఆదెమ్మమ్మమ్మ ఇంటికెళ్ళి అడుగుతూండేవాణ్ణి. పాపం ఆమె తాము తినడానికి ఉంచుకున్న వాటిని కూడా తీసుకొచ్చి ఓ సంచిలోనో, బుట్టలోనో పోసి తీసుకెళ్ళి మీ పిల్లలంతా తినండి బాబూ" అంటూ ఇచ్చేది. తనింట్లో అప్పుడు కాయలు లేకపోతే, "నువ్వెళ్ళు బాబు, నేను పెద్దాడింట్లో ఉన్నాయేమో కనుక్కుని సాయంత్రం తెచ్చిస్తా" అంటూ అన్నట్లుగానే ఎక్కడో అక్కడ ఇన్ని కాయలు తెచ్చి గుమ్మంలో పోసి "తినండి బాబూ!" అనేది.

"నిన్ను చూస్తుంటే ఆదెమ్మమ్మమ్మే గుర్తొస్తోందమ్మా. ఆ రోజులు మర్చిపోలేను. ఆదెమ్మమ్మమ్మ ఇంటికెళ్ళి మామిడికాయలు, వేరుశనక్కాయలు తెచ్చుకోవడం నాకింకా గుర్తే. ఇంట్లో పిల్లలందర్నీ తినమని ఆదెమ్మమ్మమ్మ ఇచ్చిన కాయల్ని తీసుకెళ్ళి మిగతావారికి పెట్టకుండా నేనొక్కణ్ణే తింటూంటే, వాళ్ళంతా దెబ్బలాడేవాళ్ళు. ఆ రోజులు మర్చిపోలేనమ్మా"

నేను వాళ్ళింటికి వెళ్ళి అడిగి తెచ్చినట్లు తెలిసి అమ్మ కోప్పడేది. "అదేంట్రా వాళ్ళు తినడానికి తెచ్చుకుంటే నువ్వు అడగొచ్చా? తప్పు కదూ?" అని మందలించేది.

అయినా ఆ మందలింపులు నా బుర్రకెక్కేవి కావు. ఆదెమ్మమ్మమ్మే సర్ది చెప్పేది "పోన్లేమ్మా, చిన్న పిల్లాడు. అయినా నా మనవడికి నేను ఇస్తే తప్పేంటి?" అనేది.

నేను కూడా "ఆదెమ్మమ్మమ్మనడిగితే తిడతావేంటమ్మా? మనమ్మమ్మేగా?" అనేవాణ్ణి.నాకు స్వంత అమ్మమ్మలుగానీ, నాయనమ్మలుగానీ లేరు. అందువల్ల స్వంత అమ్మమ్మకు ఆదెమ్మమ్మమ్మకు తేడా తెలిసేది కాదు. ఆమె నా స్వంత అమ్మమ్మే అనుకునేవాణ్ణి. ఈ రోజుక్కూడా అమ్మమ్మ అనే మాట వింటే ఆదెమ్మమ్మమ్మే గుర్తొస్తుంది. స్వంత అమ్మమ్మ లేనిలోటు ఆమె తీర్చింది. ఆప్యాయతను పంచిపెట్టింది. ఈనాడు అలా పరాయిబిడ్డల్ని ఆప్యాయంగా చూసేవారేరి? బంధుత్వాలలోనే ఆ ఆప్యాయతలు కరువయ్యాయి. అన్ని సంబంధాలూ వ్యాపార సంబంధాలయిపోయాయి. ఇరుగు-పొరుగువారితో అయితే చెప్పే పనే లేదు. బాబాయి అనీ, మావయ్య అనీ, అత్తమ్మ అనీ, పెద్దమ్మ అనీ- ఇలాంటి పిలుపులన్నీ దాదాపు అంతరించిపోయాయి. ఇంకా కొన్నో గొప్పో పల్లెల్లో ఎక్కడన్నా కనపడతాయేమో గాని, పట్టణాల్లో అయితే చెప్పే పనేలేదు. మానవ సంబంధాల్లో ఇలాటి ఆప్యాయతలు అంతరించి పోవడానికి కారణం ఏమిటి?

తోటివారిని ఇలా బంధుత్వాల పిలుపులతో పిలుచుకుంటే మనకు తెలియని ఆప్యాయత అంతర్లీనంగా వుండిపోతుంది. అయితే ఇప్పుడు ఓ కొత్త రకమైన పిలుపులు వచ్చాయి. అవే ఆంటీ, అంకుల్ పిలుపులు! ఈ పిలుపుల్లో వెనకటి ఆప్యాయతలున్నాయా? తమ పని నెరవేర్చుకునే తత్వమే గోచరిస్తుంది గానీ, ఈ పిలుపుల్లో ఆత్మీయత ఎక్కడ కనిపిస్తుంది? బాబాయికీ మావయ్యకీ తేడా తెలియదు. అలాగే అత్తకీ, పిన్నికీ కూడా.

ఆలోచనల్లో పడిపోయిన నన్ను చూసి రాజమ్మ "వస్తా బాబూ, మీ పని చెడ గొట్టినట్లున్నాను" అంటూ వెళ్ళబోయింది.

"వెళ్దువుగాని రాజమ్మా, ఒక్క నిమిషం కూర్చో" అంటూ నా పక్కనున్న స్టూలు చూపించాను.

"నాకి పీటలన్నీ ఎందుకయ్యా, ఇట్లా నించునో వుండాగానీ, ఏంటో చెప్పు" నీకు పిల్లలెందరు? ఏం చదువుతున్నారు?" అడిగింది.

నేను చెప్పాను "నిన్ను చూస్తుంటే ఆదెమ్మమ్మమ్మే గుర్తొస్తోందమ్మా. ఆ రోజులు మర్చిపోలేను. ఆదెమ్మమ్మమ్మ ఇంటికెళ్ళి మామిడికాయలు, వేరుశనక్కాయలు తెచ్చుకోవడం నాకింకా గుర్తే. ఇంట్లో పిల్లలందర్నీ తినమని ఆదెమ్మమ్మమ్మ ఇచ్చిన కాయల్ని తీసుకెళ్ళి మిగతావారికి పెట్టకుండా నేనొక్కణ్ణే తింటూంటే, వాళ్ళంతా దెబ్బలాడేవాళ్ళు. ఆ రోజులు మర్చిపోలేనమ్మా" అన్నాను. ఇంకా ఆ స్మృతుల్లో పడి కొట్టుకుపోతూ.

"అదంతా మీ మంచితనం బాబూ! మా అత్త నన్నెంత ఏడిపించిందీ, మేం పచ్చగా వుంటే ఓర్చేదికాదు. ఎంతసేపూ చిన్నకొడుకూ, కోడల్ని నెత్తిన పెట్టుకొనేది" అంది రాజమ్మ వెళ్ళిపోబోతూ. "వస్తా బాబూ... ఇంటి దగ్గర బోల్డు పనులున్నాయి. వంటలు ఇంకా తెమలలేదు" అంటూ బయలుదేరింది.

"మంచిదమ్మా, పీట తీసుకెళ్ళడానికి ఎన్నింటికొస్తారు?" అడిగాను నేను. లేచి నిలబడి.


"భోజనాలు కాగానే వస్తాం బాబూ! అప్పటికి నువ్వు నిద్రపోతూంటావేమో?" అంది రాజమ్మ బయటకు వెళ్ళి గేటు వేస్తూ.

నేను వెనకే వెళ్ళి గేటుకి కొక్కెం తగిలించాను. రాజమ్మ కూడా ముసలిదైపోయింది! నా కన్నా పెద్దదే. యాభైపైనే వుంటాయి. అత్త మీద కోపం ఇప్పటికీ పోయినట్లు లేదు. తల్లిదండ్రులు తమ పిల్లల్నందర్నీ సమానంగా ప్రేమించాలనుకుంటాం. అయితే వారికి తమ పిల్లల్లో వెనకబడ్డవారిపట్ల సానుభూతి వుంటుందన్న దానికి ఆదెమ్మమ్మమ్మ కూడా అతీతురాలు కాదు. అది రాజమ్మలో అక్కసును కలిగించింది. ఆ అక్కసును ఆమె అత్త చనిపోయిన ఇన్ని సంవత్సరాలకూడా వెళ్ళగక్కుతోంది!

అక్కయ్య భోజనానికి పిలిచింది. స్నానం ఇంకా చెయ్యలేదన్న విషయం గుర్తొచ్చి నీళ్ళు పెట్టింది స్టౌ మీద. స్నానంచేసి వచ్చేసరికి అమ్మ నిద్ర నుండి లేచింది. బాగా నీరసించిపోయింది. ఈ దెబ్బ ఆమెను మరింత కుంగదీసింది. ఆమెకు ధైర్యం చెప్పి నాతో పాలకొల్లు రమ్మని, ఓ నెల రోజులుందువుగాని అనీ అన్నాను. అక్కయ్యను ఒంటరిగా ఒదిలి రానన్నది. ముగ్గురం కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశాం. భోజనాలు చేస్తూండగానే నిద్ర ముంచుకొచ్చింది. భోజనం కానిచ్చి, పడుకోగానే గాఢనిద్ర పట్టింది. నిద్రలోనే ఏదో చప్పుడుకు మెలకువ వచ్చింది. ఎక్కడున్నానో ఒక్క క్షణం అర్థంకాక, లేచి చూశాను. అప్పుడు గుర్తొచ్చింది. పెళ్ళిపీటకు జనం వచ్చారు కనీసం పదిమంది. అక్కయ్య పసుపు రాసి, బొట్లు పెట్టి, తమలపాకు కట్టి సిద్ధంగా ఉంచిన పెళ్ళిపీటను వచ్చినవాళ్ళకందిస్తోంది. మళ్ళీ ఒక్కసారిగా బాండ్‌మేళం తారాస్థాయికెళ్ళింది. పీట తీసుకెళ్ళినట్లున్నారు. మేళం నెమ్మది నెమ్మదిగా వినిపించకుండా పోయింది. మళ్ళీ పడుకున్నాగానీ ఒకంతట నిద్ర పట్టింది కాదు. ఆదెమ్మమ్మమ్మే మళ్ళీ జ్ఞాపకం వచ్చింది. ఆ జ్ఞాపకాల తాలూకు ఓ సంఘటన హఠాత్తుగా గుర్తొచ్చింది.

ఒకసారి ఎందుకో పెద్దన్నయ్యకు తనమీద విపరీతమైన కోపం వచ్చింది. ఎందుకో తెలియదు. వాడికి కోపం వస్తే కిందామీదా చూడడు. ఎడాపెడా బాదేస్తాడు. తను అందరికీ పనులు పురమాయిస్తాడు. తను మాత్రం రాజాలాగా కూర్చుంటాడు. చెప్పిన పని ఎవరన్నా చెయ్యకపోతే ఏది కనబడితే దాంతో కొట్టేస్తాడు. నేను పెద్దోణ్ణి, నేను చెబితే చెయ్యవా అంటూ ఎగబడతాడు. తాను ఇంట్లో పెద్దవాడినన్న అహంభావం పెద్దయినా వదల్లేదు. అప్పుడు తాను ఏదో ఆటలా హడావిడిలో వుంటే, వాడు ఏదో పని చెప్పినట్లున్నాడు. తను చెయ్యలేదు. దాంతో ఎదురుగా కనపడ్డ ఇంత పెద్దరాయి తీసుకుని తన వెంటపడ్డాడు కొట్టడానికి. తను పరిగెత్తాడు. దెబ్బకు అందకపోయేసరికి వాడిని అహంభావం మరింత రెచ్చగొట్టింది. ఏమయినాసరే దాన్నిపెట్టి కొట్టాలని తను ఎక్కడికి వెడితే అక్కడికల్లా వెంటపడ్డాడు. తాను పరిగెత్తీ పరిగెత్తీ తమ వీధి దాటి ఎక్కడికి వెళ్ళాలో తోచక, చివరికి ఆదెమ్మమ్మమ్మ ఇంట్లోకి పరిగెత్తి దాక్కున్నాడు. ఇది చూసిన వాళ్ళు వాణ్ణి ఎంత అటకాయించినా ఆగలేదు.


ఇదంతా దూరం నుంచి చూసిన ఆదెమ్మమ్మమ్మ తనను లోపల పెట్టి బయట గొళ్ళెం వేసింది. తను కూడా లోపల గడి పెట్టుకున్నాడు. పెద్దోడు గొళ్ళెం తీసి లోపలికి రావాలని చూశాడు గానీ, తను లోపల గడి పెట్టుకున్నందువల్ల తలుపు రాలేదు. ఆదెమ్మమ్మమ్మ మందలిస్తున్నా వినకుండా వాడు అంత రాయితో కసితీరక తలుపుల కేసి విసిరికొట్టాడు. ఆ తలుపులు ఓటివే అయినా ఆ దెబ్బకు దెబ్బ తిన్నాయి గానీ, గడి ఊడి రాలేదు. ఇంతలో చుట్టుపక్కలవాళ్ళు వచ్చి పెద్దోణ్ణి కేకలేసి లాక్కెళ్ళి ఇంటిదగ్గర నాన్నకు అప్పగించారు. నాన్న అప్పుడే ఇంటికి వచ్చినట్లున్నాడు భోజనానికి. విషయమంతా విన్న నాన్నకు తీవ్రమైన కోపం వచ్చి




వాణ్ణి తీసుకెళ్ళి గొడ్ల చావిట్లో గుంజకు కట్టి, గేదెను కట్టే పలుపు తీసుకుని నాలుగు బాది, ఆ సాయంకాలం దాకా అలా కట్టేసే వుంచాడు. ఆరోజు ఆదిమ్మమ్మమ్మ ఇంటికి వెళ్ళకపోయివుంటే ఏం జరిగేదో తలుచుకుంటే ఇప్పటికీ జలదరిస్తుంది.

ఆదెమ్మమ్మమ్మ తన బాల్య జీవితంలో ఓ భాగం. గత స్మృతుల్లో ఓ తియ్యని అనుభూతి! తన ఊహల్లో ఆమె తన స్వంత అమ్మమ్మే తప్ప, తమ ఇంట్లో పనిచేసే పనిమనిషి కాదు. ఆ రోజుల్లో ఆమెకూ తమ ఇంటికీ మధ్య కూడా పనిమినిషీ-యజమానీ సంబంధం ఏమాత్రం లేదు. ఒకరికొకరు సహాయం చేసుకున్నట్లుగానే వుండేది.

> బాల్యస్మృతుల్ని నెమరు వేసుకున్నప్పుడల్లా ఆదెమ్మమ్మమ్మ గుర్తు రాకమానదు. ఆమె పట్ల మనస్సులో ఆత్మీయతాభావం, దాంతోపాటు కృతజ్ఞతాభావం కూడా కలగక మానదు.



ఆ బాల్యస్మృతుల్ని నెమరు వేసుకున్నప్పుడల్లా ఆదెమ్మమ్మమ్మ గుర్తు రాకమానదు. ఆమె పట్ల మనస్సులో ఆత్మీయతాభావం, దాంతోపాటు కృతజ్ఞతాభావం కూడా కలగకమానదు.

"ఏంటి ఇంకా మెలకువగానే ఉన్నావా చంటీ?" అక్కయ్య పలకరించింది నేను అటూ ఇటూ కదలడం చూసి.

"ఈ బాండ్‌మేళం చప్పుడుకు మెలకువ వచ్చిందక్కా. నిద్ర రావడం లేదు" అన్నాడు.


"మాకీ పెళ్ళి పీట ఓ కాలక్షేపం. నీకు ఇలాటివన్నీ ఇష్టం వుండవు కదా! సర్లే, కళ్ళు మూసుకు పడుకో. మళ్ళీ ఉదయాన్నే ట్రైన్‌కు అందుకోవాలేమో!" అంది అక్కయ్య తలుపులు వేసి తను నడుం వాలుస్తూ.

"లేదు అక్కా. రేపు ఉదయం అమ్మను డాక్టర్‌కు చూపించి, మధ్యాహ్నం బండికి వెడతా" అన్నాను.

"అంత సీరియస్సేం లేదు. వాపూ అదీ తగ్గటానికి ఓ వారం పడుతుందన్నాడు డాక్టరు. అమ్మకు నిన్ను చూడాలనిపిస్తే ఉత్తరం రాశాను. అయినా నువ్వు ఓసారి డాక్టర్‌తో మాట్లాడు, ఆమెకు ధైర్యంగా ఉంటుంది అక్కయ్య" అంది అక్కయ్య.

"అలాగే అక్కా. ఎలాగూ వచ్చా కదా. డాక్టర్‌తో మాట్లాడే వెడతాను" అంటూ నిద్రకు ఉపక్రమించాను. •

**పూర్తిగా ఆశ్చర్యకరంగా అనుకున్నవి నెరవేర్చే అద్భుతసిద్ధ ఉంగరం ఉచితం**



మీరు అనుకోకుండా ఏవైనా ఇబ్బందులలో చిక్కుకున్నా బాధపడవలసిన అవసరం లేదు. వెంటనే మా ఆశ్రమ ఉంగరం పొంది ధరించుట లేదా మీవద్ద ఉంచుకొనుట ద్వారా ఇది మీరు కోరుకున్న పురుషుడు లేదా స్త్రీ మనసుని మీ వైపు ఆకర్షిస్తుంది. మీరు ఎవరిపేరు ఉచ్చరిస్తారో, వారు ఎంతటి కఠిన హృదయం కలిగినవారైనా మీ పాదాలచెంత దాసోహం అంటారు. ఇంకా వారు మీ ఇష్టప్రకారం వ్యవహరిస్తూ నడుచుకుంటారు. వ్యాపారంలో లాభం, పరీక్షలలో విజయం, మనసుకు నచ్చిన వివాహం, పుత్రభాగ్యం, లాటరీలో బహుమతులు, ఇంట్లో గొడవలు, అనారోగ్యాలు, అప్పుల సమస్యలు మొదలైన ఇబ్బందుల నుండి విముక్తి, ఆరోగ్యం విషయంలో అనుకూలత, జ్ఞాపకశక్తి అభివృద్ధి, ఉద్యోగంలో ఉన్నత పదవులు, వ్యాజ్యాలలో విజయం, పోగొట్టుకున్న వస్తువులు దొరకుట, ఇంట్లో సుఖసంతోషాలు, ఇలా మీరు దినదిన ప్రవర్ధమానంగా పురోభివృద్ధి చెందుతూ, అన్నిపనులలో విజయం సాధించేలా చేసే అద్భుత సిద్ధ ఉంగరం ఇప్పుడు మా ఆశ్రమ విశేష యజ్ఞం సందర్భంగా కొద్దిరోజులు వరకు ఉచితంగా పంపించబడుతున్నది. దీనిని కావాలనుకొనేవారు తమ పేరు, చిరునామా మరియు ఒకటినుండి తొమ్మిది లోపల ఒక అంకెను మరవకుండా మాకు తెలియజేయవలసిందిగా కోరుతున్నాం. మీరు సంప్రదించవలసిన చిరునామా :

**MANOJ PATHAK THANTRIC (AP-2)**
**RANI BAG COLONY, P.O.KAMLAPUR (SITAPUR), U.P.261302**